# బంధుప్రేమ

తిప్పావఝుల వెంకటరామయ్య

సాయంత్రం ఆరుగంటలైంది.

ఆఫీసు నుండి అప్పుడే ఇంటికి వచ్చి "కమలా!" అని శ్రీమతిని కేకేసి మేను వాల్చాను పడకకుర్చీలో. చిరాగ్గా ఉంది.

ఒక చేత కాఫీగ్లాసు మరో చేత కార్డు ముక్కతో ప్రవేశించింది కమల.

కాఫీ అందించింది చిఱునవ్వుతో.

కార్డుకోసం చెయిజాచాను, కాఫీ అందుకుంటూనే.

"ఇంతలో ఏమీ ముంచుకుపోదులెండి. అది పుచ్చుకోండి, చప్పగా చల్లారిపోతుంది" అంటూ చెయి వెనుకకు తీసుకుంది శ్రీమతి.

"అబ్బబ్బ! అది ఇటిద్దూ నీ పుణ్యముంటుంది," అన్నాను.

"ఊఁ! కానివ్వరూ. ఇచ్చేస్తానుగా," ముద్దుగా అంది శ్రీమతి.

"రెండూ ఒకేసారి కానిస్తానుగా. ఇటివ్వు!" అని, ఇక భరించలేక లేచి గబుక్కున లాక్కున్నాను, ఆ పోస్టుకార్డును.

'అత్తగారికి అనేక నమస్కారములు. మిమ్మల్ని చూచి చాలాకాలమైంది. క్షమింప వేడుచున్నాను. మీవద్దకు రావాలని ఎన్నాళ్ళనుంచో ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఏదో ఒక అంతరం వల్ల ప్రయాణం నిల్చిపోతూనే ఉంది. ఎల్లుండి ఉదయం బండికే బయలుదేరి వస్తున్నాను. మీ వద్దనుంచి బదులు వచ్చాక బయలుదేరాలంటే ఆలస్యమౌతుందని వెంటనే బయలుదేరుతున్నాను. ఇంతేసంగతులు. ఇట్లు, రాజరాజేశ్వరి.'

ఎవరీ రాజరాజేశ్వరి? ప్రశ్నార్థక ముఖంతో శ్రీమతివంక చూశాను.

ఇంకొక ప్రశ్నార్థకం ఎగురేసింది.

రెండు ప్రశ్నార్థకాలు ఎగురేస్తే?

ఒక్క ఉదుటున లేచి పెరట్లో తులసికోటదగ్గర కూర్చొని జపమాల త్రిప్పుకుంటూన్న నాయనమ్మదగ్గర వ్రాలాను.

"ఎవరు నాయనమ్మా, రేపు రాబోయే రాజరాజేశ్వరి!" అన్నాను; ఆశ్చర్యాన్ని వ్యక్తంచేస్తూ.

"అదా!" చిఱునవ్వు నవ్వింది నాయనమ్మ.

"మా అన్న విశ్వేశ్వరయ్యగారి కూతురురా!" అంటే. త్వరగా తేల్చేసినందుకు సంతోషపడ్తూ "ఐతే, నానమ్మా! మీకో అన్నగారున్నారా! మరి నాకా సంగతి తెలీనే తెలీదే" అన్నాను నొచ్చుగుంటూ.

"నాకే బాగా జ్ఞాపకంలేదే! నీకెలా తెలుస్తుందిరా మరి; నిన్న గాక మొన్న కళ్ళు తెరచిన పసికూనవు!" అంది నాయనమ్మ, బోసినోటితో నవ్వుతూ.

ఔను; పెద్దయి బిడ్డలతండ్రినిగా బోతున్నా ఇంకా పాలబుగ్గలపసిపాపనే నేను, ఆ మెదృష్టిలో.

"నా చిన్నతనంలోనే మా అన్నయ్య చనిపోయాడురా! నామీద ఎంతఅపేక్షగా ఉండేవాడనీ! మా అన్నయ్యకు ఇద్దరు కుమార్తెలుండేవారు. పెద్ద సావిత్రి, చిన్నది రాజీ, ఈ మా చిన్న మేనగోడలేరా రేపురాబోయే రాజేశ్వరి;" అంది. కాసేపాగి.

"ఏదోరా! రాకలూ పోకలూ ఉంటుంటే కదూ మరి. వారిని నేను చూచే ముప్ఫై ఏళ్ళు పైగా అవుతోంది. మీ నాన్న పెళ్ళికి తర్లిపోతూ గూడూర్లో బస్సు కొద్దిగాబోలు ఆగితే అక్కడ కనపడిందిరా రాజీ. ఎంత సంబరపడిందనుకొన్నావ్! మమ్మల్ని పిల్చుకపోయి విందు చేసేసింది. ఎంత అపేక్ష. ఏమి మర్యాద! మళ్ళా నా కెక్కడున్నారో ఆ విషయమే తెలీదాయెను;" నిట్టూర్చింది నాయనమ్మ.

"ఐనా, దానికి చూడరా! ఎంత బంధుప్రేమోను. ఇప్పుడు నేనిక్కడున్న సంగతి ఆరా తీసి వెతుక్కుంటూ వచ్చేస్తోంది. పాపం!" ఆప్యాయతను కళ్ళలోనే ప్రతిఫలింపజేసింది నాయనమ్మ.

"నిజమేగావోసు!" అనుకున్నాను.

"నానమ్మా! ఇదివరకెప్పుడైనా మీ మేనగోడలు నిన్ను చూడను వచ్చిందా!" అన్నాను.

"ఎక్కడిదిరా! అప్పుడు చూడ్డమే! మరల రాకలూ లేవు, పోకలూ లేవు!" అంది నిష్ఠంగా.

ఔను! విచిత్రంగానే ఉంటుంది. పంథొమ్మిదో శతాబ్దంలో పుట్టి సహజమైన బంధుప్రేమలో మునిగి తేలిన నానమ్మకు రాజేశ్వరమ్మగారి రాక అభిమానపురస్సరంగానే తోచవచ్చుగాక! ఇరవైయవ శతాబ్దపు తాంత్రిక యుగంలో పుట్టి కృత్రిమమైన బంధుప్రేమతో మోహంమొగి "భోజనం చేసే వచ్చావుటోయ్!" "కాఫీ త్రాగే వచ్చుంటారే?" వగైరా సంభాషణల్లో మిగిలిఉన్న ఆ కాస్త అపేక్ష ఇంకిపోగా బంధువుల ఇళ్ళకంటే పూటకూళ్ళిళ్ళే ఎంతో నయమనిపించి వారి గడపత్రొక్కను సాహసింపని నేను రాజేశ్వరమ్మగారి రాక కేవలం అభిమాన పురస్సరమైనదేనని ఎలా నమ్మగలను? మనస్సును నమ్మించేది! ముసురుకొనివచ్చే ఆలోచనల్లో పెనుదిరిగి చూసేప్పటికి "ఇకనైనా సేవిస్తారా! మీ ఆగుడ్తాలో బాటే చల్లారిన ఈ కాఫీని?" అంటూ శ్రీమతి ప్రత్యక్షమైంది కడగంటి చూపుల్లో చిఱుకోపం ప్రదర్శిస్తూ. అప్పటికి ఈలోకంలోకి వచ్చిపడి "అరెరె! మర్చిపోయానే! ఎంత మందమతిని!" వగైరా పదాల్లో శ్రీమతిని తృప్తిపఱచ ప్రయత్నిస్తూ, కాఫీ గ్లాసు అందుకొని గరళకంఠుడు కాలకూటాన్ని మ్రింగినట్లు ఆ చల్లారిన చేదుకాఫీని ఒక్కసారిగా గొంతులో పోసుకొన్నాను. ఇంతలో "ఒరేయ్!" అన్న నాయనమ్మ పిలుపు వినపడింది.

"రేపు సెలవుపెట్టేసెయ్యరా, ఆఫీసుకు. పాపం, వాళ్ళు రాక రాక వస్తుంటే కాస్త మర్యాద అవీ చెయ్యొద్దుట్రా!" అంది. "సరే!" అన్నాను బడి ఎగ్గొట్టే పిల్లాడి మన స్తత్వంతో.

మర్నాడు అనుకున్నట్టుగా వస్తానన్న రాజేశ్వరమ్మగారు రానేలేదు. రానందుకు విచారించలేదు గాని, ఒక రోజు సెలవు నష్టమైనందుకూ, సమస్య సాధింపబడనందుకూ మాత్రం దుఃఖపడ్డాను నేను. నానమ్మ మాత్రం మహా త్రియమే పడిపోయింది.

**అర్థమెట్రిక్స్**

లెక్కల మేష్టారు: ఒరే గోపీ! నెలకు 20 రూపాయలు తీర్చే పద్ధతిని, మీ నాన్నకు నేను వంద రూపాయలిచ్చాననుకో. మూడు నెలల తర్వాత మీ నాన్న నాకెంత ఇవ్వవలసి ఉంటాడు?

గోపీ: వంద రూపాయలు సార్!

లెక్కలమేష్టారు: నీ మొహం! నీకు లెక్క అర్థంకాలేదురా!

గోపీ: సరే — మీకు మా నాన్న సంగతి అర్థంకాలేదు ముందు.

లంఘోపిన్నంగా తలపోశాము ఆమె రాని కారణాన్ని.

కాని మా ఆలోచనలను తల్లక్రిందులు చేసూ సాయంకాలానికి వచ్చేశారు. రాజేశ్వరమ్మగారి భర్తగారు. ఆ వస్తామనుకొన్న రాజేశ్వరమ్మగారికి అకస్మాత్తుగా గుండెల్లో నొప్పి వచ్చేసిందిట. లేకపోతే తప్పకుండా వచ్చేసేదిట. ఆ భర్తగారు నాయనమ్మతో చెప్పతుంటేవిన్నాను.

ఏదేలాగున్నా ఆయనగారు చాలా కలుపుగోలు మనిషి. క్షణంలో అందరితోకలిసిపోయి ఆప్యాయనిపించేశాడు. తలనెరసిన ఆ వ్యక్తి అనుభవాలువింటూనే ఆశ్చర్యపోయాన్నేను.

ఒక్కొక్కటే నాయనమ్మవేసే ప్రశ్నలకు జవాబులుగా తన కుటుంబ పరిస్థితుల్ని కపటంలేకుండా పూసగ్రుచ్చినట్లు చెప్పేశాడు. కథలాగున్నా నన్నాకర్షించింది, ఆ చెప్పే ధోరణి, ముఖ్యంగా దాపరికం లేకుండా, కుండబ్రద్దలు కొట్టినట్టు యదార్థాన్ని చెప్పెయ్యడంలోని సొగసూ మాత్రమే.

వారు ఆరునెల్ల క్రితం ఉద్యోగంనుండి రిటైరయ్యారట. నలభైరూపాయల పెన్షను మాత్రం వస్తుంటుందిట. దాంతో సంసారనౌక జరగాలి. ఆయనగారికి మగసంతానం లేదుగాని ఎనిమిదిమంది ఆడపిల్లలు. అంతా పెండ్లికు వచ్చినవారూ, మించినవారూనట. పెద్దమ్మాయి పెండ్లితో ఉన్న ఎకరము మాగాని ఊడ్చుకొనిపోగా మిగిలింది తనూ, రెక్కలకష్టమూనట.

నలుగురమ్మాయిలు చదువుతున్నారట. ఒకమ్మాయి మాత్రం సెకండ్రీ ట్రెయినింగు ప్యాసైనా ఉద్యోగం మాత్రం లభించలేదట.

ఆడపిల్లల పెళ్ళిళ్లు చేయలేక తహతహలాడేకుటుంబా లెన్ని లేవు! ఈయన పరిస్థితి వింటేనే భయంకరంగా ఉందే. ఆ వరసని తలిస్తే ఏడుగురు కుమార్తెలకూ పెళ్ళిళ్లు చేయాలంటే ఏడు రెండ్లు పద్నాలుగు వేలైనా కావాలా! ఎక్కడనుండి తెచ్చేట్లు! ఎలా నెగ్గుకొచ్చేట్లు? కుతకుతలాడే లావాతో నిండి పైకి గంభీరంగా ఉన్న అగ్ని పర్వతంలా బాధనంతా లోపలే యిముడ్చుకొని కుములూ పైకి గంభీరంగా కనబడుతున్నాడాయాయన!

రాత్రి భోజనాలవుతున్నాయి. ఆదరువు లెక్కువగానే చేసింది నాయనమ్మ. "దొడ్డమ్మా! నేనేమి బకాసురుణ్ణనుకొన్నారా! ఇలా వడ్డిం చేస్తున్నారు!" అని నవ్వారాయన! కొసిపాగి "విస్తట్లో వేసినవి పారేయడమంటే చాల కష్టమేస్తుంది దొడ్డమ్మా!" అని నిట్టూర్చారు. ఏ రెండు మూడో తప్ప మిగిలిన వంటకాలు వడ్డించనీయలేదాయన. ఆయన బాధ అర్థమైంది నాకు.

భోజనా లయ్యాయి.

పిండారబోసినట్లు వెన్నెల విరగ్గాస్తోంది. కొబ్బరి చెట్లమీంచి చల్లని పైరుగాలి; పైన మేఘాలచాందిని, క్రింద తెల్లని పరుపులపైన మేము; మా అతిథి నెమ్మదిగా నాయనమ్మ పక్కకు చేరాడు, "దొడ్డమ్మా!" అంటూ. చెవులు రిక్కించి విన సాగాను నేను.

"ఏమి నాయనా!" అంది నానమ్మ.

"అదే దొడ్డమ్మా! మీ పుట్టింటి సంగతి. మరి మీ తాతగారిపే రేమిటన్నావ్!" అని అడిగారాయన.

"సుబ్రహ్మణ్యేశ్వర శాస్త్రి గారు — నాయనా!" అంది నాయనమ్మ. ఆయన్ను గూర్చి ఒక చిన్న ఉపోద్ఘాతం ప్రారంభిస్తూ.

"అదిగాదమ్మా! మీకక్కడ కొంత ఆస్తి ఉన్నది గదూ!

"ఔను. పెద్దమండువాయిలు. నాలెక్క రాల మంచి మాగాని ఉండేది" అంది, నాయనమ్మ.

"ఐతే; ఆ మాగాని మీ తాతగారి హయాంలో లభ్యమైందీ, లేక మీ నాయనగారి హయాంలోనైంది! నీకేమైనా తెలుసునా దొడ్డమ్మా?"

"ఏదో, నాయనా! యాభైఏళ్ళనాటి సంగతి. చాలాకాలంనుంచి ఉన్నట్టే జ్ఞాపకం. ఎలా లభ్యపడిందో నాకెలా తెలుస్తుంది. అప్పటికి పసిదాన్ని నేను. ఎక్కువగా మా అక్కగారింట్లో ఉంటూ ఉండే దాన్ని. మా అన్నగారు చనిపోయాక మరి రాకలూ పోకలూ కూడా లేవాయెను ఐనా దేనికిరా, ఆ వివరా లిప్పుడూ?" ప్రశ్నించింది నాయనమ్మ.

"మీ పెదమేనగోడలికి కొడుకొకడున్నాడు. వాడొట్టి వాజమ్మలే. వాడి చెవులికి తాటాకులు గట్టి ఏదో పాతికో పరకో చేతబెట్టి పదివేలు చేసేమాగాని, కనీసం నాలుగువేలు చేసే యిల్లూ వ్రాయించుకొన్నాడో మోతుబరి వాడిచేత. మీ అన్నకేమో మగ పిల్లలు లేక పోయిరి. సగమాస్తికి మీ చిన్న మేనగోడలికి హక్కుంది గదూ, దొడ్డమ్మా!"

"నిజమే గదూ! లేకుండా ఎలాపోతుంది, మరి." బలపరిచింది నాయనమ్మ.

"పెద్ద మేనగోడలుకు వారసు చిన్న మేనగోడలు. చిన్న మేనగోడలుకు తదనంతరం మాత్రమే వాడికి సగమాస్తి సంక్రమిస్తుంది. అక్రమంగా వాడిచేత విక్రయించుకొన్నారు గాబట్టి వ్యవహారం చేయాలనుం- దొడ్డమ్మా! అందుకు ఆస్తి పై మీ తండ్రిగారికి గల హక్కును ముందుగా ఋజువు పర్చాలి. ఆ వివరాలు మీకేమైనా తెలిసి ఉండవచ్చుని... ..." తేల్చేశాడాయన వచ్చిన పని.

"అయ్యో, తెలిస్తే అభ్యంతరమేముంది నాయనా చెప్పనూ! ఆ వివరా లెక్కడ దొరుకుతాయో విచారించి వ్యవహారం చేసెయ్. వచ్చే ఆస్తి ఎందుకు పోగొట్టుకోవాలి మరి! పాపం! నాకేమైనా తెలుసు నేమోనని ఇంతదూరం వెదుక్కొంటూ వచ్చే నిరుపయోగమాయెను!" అని నాయనమ్మ ఎంతగానో నొచ్చుకుంటూంటె "పోనీలే! దొడ్డమ్మా. తెలిస్తే నీవు మాత్రం చెప్పక పోదువా ఏమిటి?" అని ఓదార్చాడు ఆయన.

"ఐతే రాజేశ్వరి ఇందుకేనట్రా వస్తానని వ్రాసింది!" ప్రశ్నించింది నాయనమ్మ.

"ఆవలిస్తే ప్రేగులు లెక్కిస్తుందే నాయనమ్మ!" అనుకున్నాను నేను.

అంతబోళా మనిషీ కొంత తటపటాయించాడీ ప్రశ్నకు జవాబు చెప్పటానికి.

"అవును...... రెండు విధాలా కలిసొస్తుందని రావాలనుకొంది, దొడ్డమ్మా!"

"పోనీ లేరా! ఇంకోమారైనా పంపరా! నాల్గురోజు లుండొస్తుంది రాజి." అనునయంగా చెప్పింది నాయనమ్మ.

"ఆ! ఇక వచ్చినట్టే!" అనుకున్నాను నేను.

"అలాగే దొడ్డమ్మా! చిన్నమ్మాయి సంబంధాలొస్తున్నాయి! చూచి రావాలి నేనూ అదిపోయి. తీరిక చూసుకుని వస్తుందిలే!" అన్నాడు రాజేశ్వరమ్మగారి భర్త.

మబ్బుల్లో దాగున్న చందమామ బైటికి వచ్చి స్వచ్ఛంగా ప్రకాశిస్తున్నాడు. మనస్సులోని మంచుతెరలు విడిపోగా సంతృప్తితో మేనువాల్చాను నేను. ★

పెరీరా వారి
షీమార్
కుటుంబానికంతా ఉపయోగపడు
దగ్గు నివారిణి
అన్ని షాపులలోనూ దొరకును
వ్యాపార వివరములకు వ్రాయండి
విల్‌ఫ్రెడ్ పెరీరా ప్రైవేట్ లి.
మద్రాసు-7

నంజనగూడు పండితపాదివారి
జ్వరేగ్
సకల జ్వరములను అద్భుతముగా నివారించును.
క్యాటలాగ్ ఉచితము
ఏజెంట్లు యునైటెడ్ కన్సర్న్, మదరాసు-1.